క్లుప్తంగా

సర్వేకు విపక్షాలు సహకరించాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ ప్రక్షాళనకు రాష్ట్రంలోని వివిధ పార్టీల నాయకులు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో నమామీ గంగే మిషన్‌తో గంగానదిలో మురికి క్లీన్ చేస్తున్న బీజేపీ, తెలంగాణలో మాత్రం మూసీ పునర్జీవాన్ని వ్యతిరేకించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మూసీని ప్రక్షాళన చేసి, గంగానది నీరు తీసుకొస్తే నల్గొండ జిల్లా వరకు తాగునీరు, వాతవరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలకు మరొక ప్రదేశంలో నివాస వసతి కల్పిస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హుడాసాయినగర్, సౌత్‌ఎండ్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. 11కేవీ దుర్గానగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ గ్రీన్‌హిల్స్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు. 11కేవీ హనుమాన్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ లెక్చరర్స్‌కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామ శివారులోని లచ్చానాయక్ తండాలో దాచ్యానాయక్ అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఈ ఆర్థిక సాయాన్ని ఆదివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు గ్యార సురేశ్ మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తండా యువకులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం మైసమ్మ దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. మూడునెలల్లో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు.

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి

షాబాద్: పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలో మండల పరిధిలోని సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలును పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎనికైన నర్సింలు మాట్లాడుతూ.. ఉపాధ్యక్షుడిగా తనను ఎనుకున్నందుకు జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పద్మశాలీలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కొందుర్గు: మండల కేంద్రంలోని రాజేశ్‌పటేల్ మినీఫంక్షన్ హాలులో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు సంబంధించిన 30 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ప్రతిభ ఆధారంగా నిర్వాహకులు విద్యార్థులకు బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. న్యూమాంక్స్ కుంగ్‌ఫూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్, కార్యక్రమంలో కుంగ్‌ఫూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్, మాస్టర్లు నరేందర్, బాలరాజు, శ్రీరామం, గణేశ్ తదితరులు ఉన్నారు.

జోరుగా కల్తీ ఆహార విక్రయాలు

మున్సిపాలిటీలో తనిఖీలు చేపట్టని అధికారులు

- అపరిశుభ్రంగా దర్శనమిస్తున్న హోటళ్లు
- గడువు ముగిసిన వస్తువుల విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



తుక్కుగూడలో స్వీట్ హౌస్ నిర్వాహకులకు జరిమానా వేస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

తుక్కుగూడ: కల్తీ ఆహార పదార్థాల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా హోటళ్లు, బేకరీలు, కిరాణ దుకాణ వ్యాపారులు నాణ్యత లేని సరుకులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారుల అభిరుచి, ఆసక్తిని ఆసరాగా చేసుకొని ధనార్జనే ధ్యేయంగా వ్యాపారం చేస్తూ.. ప్రజారోగ్యాన్ని గాలిలో దీపంలా మారుస్తున్నారు.

పరిశుభ్రత కరువు..

మున్సిపాలిటీలోని శ్రీశైలం జాతీయ రహదారి, హార్డ్‌వేర్‌పార్క్, ఈ–సిటీ, మంఖాల్ పారిశ్రామిక వాడలో వేలాది మంది కార్మికులు పనిచేయడం, వండర్‌లా పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ ఎయిర్ పోర్టు నగరానికి అతి సమీపంలో ఉండటంతో పురపాలక పరిధికి నిత్యం వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీంతో మున్సిపాలిటీలో హోటళ్లు, బేకరీలు, తదితర తిను బండరాల దుకాణాలు నిత్యం కొనుగోలు దారులతో రద్దీగా ఉంటాయి. దీన్నే ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు.. నాణ్యతలేని సరుకులు, గడువుతీరిన పదార్థాలను అధిక ధరకు విక్రయిస్తూ లాభాలు దండుకుంటున్నారు. ఇవి తిన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఏ హోటళ్లలో చూసినా అపరిశుభ్రత దర్శనమిస్తుందని, అయినా మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇద్దరికి అస్వస్థత..

ఈ నెల 15న మున్సిపాలిటీలోని బాలాజీ స్వీట్ హౌస్‌లో జీఎంఆర్ సంస్థలో పనిచేసే ఇద్దరు వ్యక్తులు స్వీట్లను కొనుగోలు చేసి తిన్నారు. స్వీట్లు తిన్న కొద్దిసేపటికే వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు అధికారులు స్వీట్ హౌస్‌లో తనిఖీ చేసి, కల్తీ వస్తువులను గుర్తించి రూ.10వేల జరిమానా వేశారు.

జాడలేని తనిఖీలు

జాతీయ రహదారులపై ఉన్న హోటళ్లు, ఇతర ఆహార విక్రయ షాపులపై తనిఖీలు చేయాల్సిన అధికారులు జాడ కానరావడం లేదు. దీంతో వ్యాపారులు ఆడింది ఆట, పాడింది పాటగా మారింది. అధికారులు మామూళ్లు వసూలు చేసుకొని, తనిఖీలు చేయడం లేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపాలటీలో ఉన్న ఆహార విక్రయ కేంద్రాలపై మున్సిపల్ అధికారులు, ఫుడ్ తనిఖీ అధికారులు దాడులు చేసి, నాణ్యమైన ఆహారం విక్రయించిలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తనిఖీలు చేపడతాం

మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ స్వీట్ హౌస్‌పై ఫిర్యాదు రావడంతో దాడులు చేసి, నాణ్యత లేని పదార్థాలను గుర్తించాం. రూ.10 వేల జరిమానా విధించాం. వ్యాపారులు ప్రజలకు నాణ్యమైన ఆహారం, ఇతర వస్తువులను విక్రయించాలి. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఏ.వాణి, మున్సిపల్ కమిషనర్

సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారు?

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్

కందుకూరు: రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఫ్యూచర్ సిటీ రహదారి కోసం అధికారులు ఎలా సర్వే చేస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులు రైతుల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం నిర్మించబోతున్న 300 అడుగుల రోడ్డు కోసం బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట, రాచులూరు, బేగంపేట తదితర గ్రామాల రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పొలాల్లో సర్వే చేయడం ఏమిటన్నారు. రైతులు అడిగిన విధంగా న్యాయం జరిగేంతవరకు అధికారులు ముందడుగు వేయొద్దన్నారు. రైతులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి, రైతుల మధ్య సమన్వయ కర్తలుగా వ్యవహరించాలని కోరారు. రైతులకు తగిన న్యాయం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ రైతుల పక్షాన ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు ప్రతిపాదన

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ సమక్షంలో ఎంపిక

కందుకూరు: మహేశ్వరం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా మండలంలోని పెద్దమ్మతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సభావత్ కృష్ణనాయక్‌ను పార్టీ అధికారికంగా ఎంపిక చేసింది. కృష్ణనాయక్ 2001–06 వరకు పులిమామిడి ఎంపీటీసీ సభ్యుడిగా, 2006–11 వరకు అతని భార్య గోపి ఎంపీపీగా, 2011–16 వరకు పార్టీ జిల్లా కార్యదర్శిగా, 2017–2024 వరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఆయన సేవలందించారు. కాగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి కృష్ణనాయక్‌ను ఎంపిక చేశారు. ఆయనను చైర్మన్‌గా నియామకం చేపట్టేలా ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నట్లు కేఎల్‌ఆర్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా పార్టీ తన పేరును ప్రతిపాదించడంపై కృష్ణనాయక్ సంతోషం వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకులు అందుగుల సత్యానారాయణ, కప్పాటి పాండురంగారెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, పున్న గణేష్, కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మంద సాయిలు, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, యుగేంధర్‌గౌడ్, మనద్‌పాల్‌రెడ్డి, మర్యాద మురళీధర్‌రెడ్డి, వత్తుల రఘుపతి, శివగాళ్ల యాదయ్య, పాండురంగారెడ్డి, లాజర్, సుభాష్, మహేందర్, మహ్మద్ రహీమ్, మీగడి శేఖర్ తదితరులు పాల్గొని ఆయనను అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న హన్మానాయక్ తదితరులు

లగచర్ల దాడి వెనుక బీఆర్‌ఎస్

- రైతులను రెచ్చగొట్టింది మాజీమంత్రి కేటీఆర్
- తొలుత కేటీఆర్‌ను అరెస్టు చేయాలి
- గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్

కద్తాల్: 'లగచర్ల ఘటన దురదృష్టకరం. దీని వెనుక బీఆర్‌ఎస్ నేతల హస్తం ఉంది. రైతులను రెచ్చగొట్టి.. అధికారులపై దాడికి పాల్పడేలా ప్రేరేపించింది ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్' అని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ఆరోపించారు. తొలుత ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాలలో ఫార్మాకంపెనీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారని తెలిపారు. అందులో భాగంగానే ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజాభిప్రాయ, భూసేకరణకు కలెక్టర్ తదితర అధికారులు లగచర్లకు వెళ్లారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కొంత మంది పక్కా ప్రణాళిక ప్రకారం.. భూమి లేని వ్యక్తులకు డబ్బు ఆశ చూపి, అధికారులపై దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. ప్రజల తరఫున పోరాడాల్సిన ప్రతిపక్ష నాయకులు.. అమాయక ప్రజల జీవితాలతో ఆడుకోవడం దురదృష్టకరమన్నారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

అభివృద్ధిలో వెనుకబడిన కొడంగల్ ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రాంత ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని హన్మానాయక్ తెలిపారు. ఇది చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు పన్నుతూ, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు నాటి ప్రతిపక్ష పార్టీలకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదని, కనీసం నిరసనలు తెలిపేందుకు నిరాకరించారని మండిపడ్డారు. అలాంటి బీఆర్‌ఎస్ నేతలు.. ఇప్పుడు ధర్నాలు, నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కేటీఆర్, హరీశ్‌రావులు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. దాడులను ప్రోత్సహించడం మానుకోవాలని, ఇలాంటి చర్యలు ఆపకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీసెల్ బ్లాక్ అధ్యక్షుడు రామకృష్ణ, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు లక్పతినాయక్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు భిక్షపతి, మల్లయ్య, నరేందర్, మోత్యానాయక్, బలరాంనాయక్, రమేశ్ నాయక్, నరేశ్‌నాయక్, దేవ్లానాయక్, సేవ్యానాయక్ తదితరులు ఉన్నారు.



సింహగర్జన సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలకిషన్ తదితరులు

బహిరంగ సభను విజయవంతం చేయాలి

కందుకూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాద్ జింఖాన గ్రౌండ్‌లో పదిలక్షల మందితో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాల సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రం సీతారామశాస్త్రినగర్‌లో కరప్రతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తెలంగాణ మాలలు అహోరాత్రులు శ్రమించారని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు. ఎస్సీలకు కావాల్సింది వర్గీకరణ కాదని, దళితుల సమగ్ర అభివృద్ధి జరగాలని, అందుకు తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్లు 15 శాతం నుంచి 25 శాతానికి పెంచాలన్నారు. అత్యంత వెనకబడిన మాలల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో బీజేపీకి పని చేసిన మంద కృష్ణ మాటలు నమ్మి ఇబ్బందుల పాలు కావొదని సూచించారు. 1న నగరంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు, మాలలు భారీ ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాలాల శ్రీశైలం, గాడి లక్ష్మయ్య, రాములు, యాదయ్య, వీరమల్ల నర్సింహ, యాలాల శ్రీనివాస్, పాండు, పాశం శ్రీనివాస్, దార బాల్‌రాజ్, విష్ణు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

21న అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన



అయ్యప్ప దేవాలయం

తుర్కయంజాల్: హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 18వ తేది నుంచి ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాత తాటిచెట్టు గీతాదేవి అశోక్ గౌడ్‌లు తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు గణపతి పూజ, స్వామి వారి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 19న ఉదయం 9.45 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, ఋత్విక్ వరణ, అంకురారోపణ, యాగశాల ప్రవేశం, స్థాపిత మంటప పూజలు, అగ్ని ప్రతిష్ఠ, 20న మంటపారాధన, హోమాలు, జపాలు, శయ్యాధివాసం, వస్త్రాధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం, 21న ఉదయం 6 గంటలకు గర్తన్యాసము, 9.50 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, వేదాశీర్వచనములు, 11 గంటలకు మహాపడి పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు.. సాధారణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

- రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి
- డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: రైతుల తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దిగుబడిని విక్రయించి, మద్దతు ధర పొందాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా సూచించారు. ఆదివారం కడ్తాల్ మండల కేంద్రం సింగిల్‌విండో సబ్‌సెంటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు ఆధ్వర్యంలో.. సింగిల్‌విండో సబ్ సెంటర్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాన్ని సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. వరి క్వింటా ధాన్యానికి మద్దతు ధర రూ.2330 కాగా, రెండో రకానికి రూ.2300లుగా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. సన్న రకం ధాన్యం క్వింటాల్‌కు రైతుకు ప్రోత్సాహకంగా రూ.500 బోనస్ ఇవ్వనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్ జోగు వీరయ్య, సీఈఓ దేవేందర్ తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు

తలకొండపల్లి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం వరి ధాన్యం కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పడకల్, తలకొండపల్లి, రాంపూర్, వెల్జాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ఆమనగల్లులోని లక్ష్మీ వేంకటేశ్వర పారబాయిల్డ్, కనకదుర్గ రైస్ మిల్లులు అలాట్ అయినట్లు పేర్కొన్నారు. రైతులు సహకరించి, ప్రభుత్వం సూచించిన ప్రకారం తేమ 17 శాతం లోపు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని ఆయన కోరారు.



నూతన కమిటీ సభ్యులు

విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక

మాడ్గుల: విశ్వబ్రాహ్మణ సంఘం ఇర్విన్ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాసోజు జంగాచారి, అధ్యక్షుడిగా విశ్వరూప చారి, కోశాధికారిగా యాదయ్యచారిలను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భూపేష్ చారి, చంద్రయ్య, యుగేందర్, మహేంద్ర చారి, యాదయ్య, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



షాబాద్: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూద యాదయ్య, మాజీ సర్పంచ్ ర్యాకల శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న దేవాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలు, మల్లన్న నామస్మరణతో మల్లన్న బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాల ఊరేగింపుతో ఆలయానికి తరలివచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి బారులు తీరి పూజలు చేశారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు ఆంజనేయులు, నర్సింలు, కుమార్, రాజుగౌడ్, శంకర్, శివ, శేఖర్, అనిల్ ఉన్నారు.



అమ్మవారి సన్నిధిలో భక్తులు

వైభవంగా మైసిగండి మైసమ్మ జాతర

మూడోరోజు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

కడ్తాల్: మైసిగండి మైసమ్మ తల్లి జాతర వైభవంగా జరుగుతోంది. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం మైసమ్మను విశేషంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు చేశారు. సెలవురోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొక్కలు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత, నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ఆలయ పరిసరాల్లో భక్తజనం